క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగుతో లాభం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

ఆసిఫాబాద్‌రూరల్: రైతులకు ఆయిల్‌పామ్ చెట్ల పెంపకంతో అధిక లాభం ఉంటుందని ఏవో ఖాదర్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని ఈదులవాడ గ్రామంలో ఆయిల్‌పాం సాగు విధానంపై అవగాహన కల్పించారు. మొక్క ధర రూ.193 కాగా రాయితీపై కేవలం రూ.20లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి నదీమ్, ఏఈవోలు, చిరంజీవి, గ్రామ సర్పంచ్ భీమేష్ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉర్దు మీడియం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బోధనా వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నిసార్, జమీల్, హెచ్‌ఎం నిజాముద్దీన్ తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని రవిచంద్ర కాలనీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు సురేష్, సౌజన్య, జమున, సర్పంచ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలోని ఆయా పట్టణ, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో బుధవారం సిర్పూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాత్రికేయులు కాగజ్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో రాజేశ్వర్‌కు అందజేశారు.

కాగజ్‌నగర్ సీఐగా బుద్దే స్వామి



బాధ్యతలు స్వీకరిస్తున్న స్వామి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణ సీఐగా బుద్దే స్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండేళ్లుగా కౌటాల సీఐగా సేవలు అందించిన ఆయన కాగజ్‌నగర్‌టౌన్ సీఐగా బదిలీపై వచ్చారు. పట్టణంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని, ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్పను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

రెబ్బెన: మండలంలోని నారాయణపూర్‌లో మంగళవారం రాత్రి బాలిక వివాహాన్ని చైల్డ్ ప్రొటెక్షన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు అడ్డుకున్నారు. నారాయణపూర్‌కు చెందిన బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో బుధవారం పెళ్లి చేసేందుకు ఇరు కుటుంబాలు నిశ్చయించారు. విషయం తెలుసుకున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మహేష్, రెవెన్యూ, పోలీస్ శాఖ సహకారంతో మంగళవారం రాత్రి బాలిక ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి పెళ్లి రద్దు చేయించారు. బాలికకు 18 ఏళ్లు వచ్చే వరకూ వివాహం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరువురు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం ఉదయం ఐసీడీఎస్ అధికారులు బాలిక తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై వివరించారు.

వైద్యానికి 'జాతీయ గుర్తింపు'

- కౌటాల పీహెచ్‌సీకి 'ఎన్‌క్వాస్'
- ప్రైవేట్ నర్సింగ్‌హోంను తలపిస్తున్న ఆరోగ్య కేంద్రం
- అందుబాటులో మెరుగైన వైద్యసేవలు



కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కౌటాల: కౌటాల పీహెచ్‌సీకి అరుదైన గౌరవం దక్కింది. రోగులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తూ జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉత్తమ పీహెచ్‌సీగా గుర్తింపు పొందిన ఈ ఆరోగ్య కేంద్రానికి తాజాగా జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ సంస్థ (ఎన్‌క్వాస్) గుర్తింపు లభించింది. దీంతో వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో..

గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందేవి కావు. దీనికి తోడు ప్రభుత్వ ఆస్పత్రి, పీహెచ్‌సీలలో కనీస వసతులు లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులంటేనే రోగులకు ఒకింత అసహనం ఏర్పడేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రజామన్ననలు పొందుతున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా జాతీయస్థాయిలో పీహెచ్‌సీలు గుర్తింపు కైవసం చేసుకోవడంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతుంది. గత ఏడేళ్లుగా కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తుండడంతో ఆసుపత్రికి రోగుల తాకిడి పెరిగింది.

పుట్టింటికి వెళ్లకుండా..

కౌటాల పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి గర్భిణీలకు అధికంగా సాధారణ కాన్పులు చేస్తున్నారు. దీంతో కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాల్లోని గర్భిణీలు, మొదటి కాన్పు అయిన వాళ్లు పుట్టింటికి వెళ్లకుండా కౌటాల పీహెచ్‌సీలోనే వైద్యసేవలు పొందుతున్నారు. ఆసుపత్రిలో ప్రతిరోజు వైద్యాధికారితో పాటు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషన్, హెల్త్ సూపర్‌వైజర్‌తో పాటు మిగతా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. రోగులకు రెండు పూటల ఉచిత భోజనం అందిస్తున్నారు. ఆసుపత్రి భవనం ఆవరణలో 108 అంబులెన్స్, అమ్మఒడి, అల్వాల్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటున్నాయి.

సాధారణ ప్రసవాలకు కేరాఫ్..

గత ఏడేళ్లలో 3,218 సాధారణ కాన్పులు చేసి రాష్ట్రంలోనే అత్యధిక సాధారణ కాన్పులు చేస్తున్న పీహెచ్‌సీగా కౌటాల ఆసుపత్రి రికార్డు సృష్టించింది. పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అంబులెన్స్‌లో ప్రతీ సోమ, శుక్రవారాల్లో వారిని ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. మందులు అందించడంతో పాటు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. పురిటి నొప్పులు రాగానే గర్భిణీని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకొచ్చి సాధారణ కాన్పు చేసి రెండు రోజుల పాటు ఆసుపత్రిలోనే తల్లి, బిడ్డకు వైద్య సేవలు అందించి తిరిగి అంబులెన్స్‌లో ఇంటికి తరలిస్తున్నారు. దీంతో కౌటాల పీహెచ్‌సీలో వైద్యం కోసం గర్భిణీలు క్యూ కడుతున్నారు.

దక్కిన గౌరవం..

గత డిసెంబర్ 28, 29వ తేదీల్లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్వాస్) బృందం పీహెచ్‌సీని పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. జాతీయ హెల్త్ మిషన్ కార్యక్రమాలు అమలు, సేవల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగ్గా ఉండడంతో కౌటాల పీహెచ్‌సీకి 83.6 మార్కులు కేటాయించి రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్ కేటాయించింది. దీంతో జాతీయస్థాయి గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటుగా మూడేళ్ల పాటు ఏడాదికి రూ.3 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు మంజూరు కానున్నాయి.

కౌటాల పీహెచ్‌సీలో సాధారణ కాన్పుల వివరాలు..

సంవత్సరం	కాన్పులు
2017	533
2018	632
2019	554
2020	567
2021	480
2022	452

వసతులు బాగున్నాయి



సాధారణ కాన్పులకు పుట్టినిల్లుగా కౌటాల పీహెచ్‌సీ ఉంది. నాకు సాధారణ కాన్పులో పాప పుట్టింది. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించారు. ఆసుపత్రిలో రెండు పూటల భోజనం పెట్టారు. ఆస్పత్రిలో వసతులు చాలా బాగున్నాయి. మొదటిసారి కూడా సాధారణ కాన్పు ద్వారా ఇక్కడే నాకు పాప పుట్టింది.

- మేడి మేఘన, బాలింత, సాండ్‌గాం

సాధారణ కాన్పులకు ప్రాధాన్యత



ఇక్కడి పీహెచ్‌సీలో సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి ప్రతీ సోమ, శుక్రవారాల్లో గర్భిణీలకు వైద్య పరీక్షలు చేస్తున్నాం. నెలలు నిండిన అనంతరం పీహెచ్‌సీకి తరలించి సాధారణ కాన్పు చేసి తిరిగి ఆరోగ్యంగా ఇంటికి అంబులెన్స్‌లో పంపిస్తున్నాం. ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి సైతం మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

- నవత, వైద్యాధికారి, కౌటాల

మెరుగైన వైద్య సేవలు



ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలతో పాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. కౌటాల పీహెచ్‌సీకి జాతీయ ప్రమాణాల పత్రానికి ఎంపికవ్వడంతో ఆసుపత్రికి ప్రత్యేక నిధులు వస్తాయి. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ఎన్‌క్వాస్ ప్రమాణాలు ఉండాలన్నది మా లక్ష్యం. జిల్లాలోని రోంపల్లి, కెరమెరి, గిన్నెదరి ఆరోగ్య కేంద్రాలను సైతం త్వరలో నాణ్యత ప్రమాణాల బృందం పరిశీలించనుంది.

- రామకృష్ణ, జిల్లా వైద్యశాఖ అధికారి

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ చౌక్ నుంచి రాజీవ్‌గాంధీ చౌక్ వరకు ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని ఇంజనీరింగ్ శాఖ అధికారులు రోడ్డు పనులను ప్రారంభించారు. ఉదయం మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ అంజయ్యలతో పాటు ఇంజనీరింగ్ శాఖ అధికారులు పనులను పరిశీలించారు.

ఘనంగా మౌలానా అబుల్‌కలాం వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 65వ వర్ధంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ మౌలానా ఆజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అహ్మద్‌బిన్ అబ్దుల్లా, సాజిద్, ఎండీ అహ్మద్, షబ్బీర్, సయ్యద్ సోజర్, వసీం పాల్గొన్నారు.

'పది' విద్యార్థుల మార్కులు పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో రమేష్‌బాబు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో 10వ తరగతి ఎఫ్‌ఏ మార్కులను బుధవారం ఎంఈవో రమేష్‌బాబు పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి, రికార్డుల్లో నమోదు చేసిన మార్కులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు యాదగిరి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, విజయనగరంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను ఉపాధ్యాయుల బృందం అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహించిన అంతర్గత మార్కుల రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఎఫ్‌ఏ1 మార్కులకు ఎఫ్1లోనే రౌండ్ ఆఫ్ చేయాలని స్థానిక హెచ్‌ఎంలకు సూచించారు. అధికారులు గావుడే హన్మంతు, శ్యాంరావు, శ్యామ్ సుందర్ ఉన్నారు.

జీవాలకు నట్టల నివారణ టీకాలు



దహెగాం: నట్టల నివారణ టీకాలు వేస్తున్న ఎంపీటీసీ



ఆసిఫాబాద్‌రూరల్: మందు వేస్తున్న అధికారి

దహెగాం: మండల కేంద్రంలోని గొర్రెలు, మేకలకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా టీకాలు వేశారు. ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు అందిస్తున్న నట్టల నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్చి 1వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలో 841 మేకలు, 70 గొర్రెలకు టీకాలు వేయించారు. సహకార సంఘం వైస్ చైర్మన్ ధనుంజయ్, పశువైద్య సిబ్బంది నరేశ్, సురేష్, హనుమయ్య, జగన్నాథ్‌రావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సురేష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావుతో కలిసి నట్టల నివారణ మందులు వేశారు. ఎంపీపీ మల్లికార్జున్, పశువైద్యాధికారి మురళీకృష్ణ, వైద్య సిబ్బంది నాగన్న, ప్రశాంత్, పురుషోత్తం, కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండలంలోని ఇందాని గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని 1800 గొర్రెలు, 2700 మేకలకు మందులు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి శివ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వినోద్, రాజు, సునీల్, గణపతి, లాలాజీ, నవీణ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: పశువుల్లో వచ్చే వ్యాధులపై పశుపోషకులు జాగ్రత్తలు వహించాలని పెంచికల్‌పేట్ పశువైద్యాధికారి రాకేష్ అన్నారు. బుధవారం మండలంలోని పెంచికల్‌పేట్, ఎల్లూర్, ఎల్కపెల్లి గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో పశువులు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నందున పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మేకల కమల, గణపురం కావ్య, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, వైద్యసిబ్బంది శివ పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: జీవాలకు పశుపోషకులు నట్టల నివారణ మందులు వేయించాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, సిబ్బంది రాజన్న, సందీప్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ, కోయవాగు, బల్లల గ్రామాల్లో బుధవారం పశువైద్యాధికారి విజయ్ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. 1254 గొర్రెలకు, 523 మేకలను మందులు వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్లు శైలేందర్, రాజ్‌కుమార్, గోపాలమిత్ర రమేశ్‌బాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కార్యదర్శులు

సిర్పూర్(టి)/కౌటాల: కౌటాల మండలం గురుడుపేట పంచాయతీ కార్యదర్శి గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. గణేష్ భార్య రోహిణికి స్థానిక జైభీం నగర్‌లో రూ. 91వేల నగదు అందించారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు తిరుపతి, ఆసిఫ్ అలీ, ప్రదీప్‌గౌడ్, కైలాష్, రాహుల్, సందీప్ పాల్గొన్నారు.

టీచర్‌కు సన్మానం

కెరమెరి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు సుష్మను బుధవారం ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 317జీవోలో భాగంగా మంచిర్యాల జిల్లా నుంచి ఇక్కడికి రాగా ఇటీవల ప్రభుత్వం స్పౌజ్ బదిలీలు చేపట్టడంతో తిరిగి మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. టీచర్లు భరత్, ధన్‌రాజ్, రవీందర్, ప్రశాంతి, యశోద, ధన్‌లాల్, సంతోష్, నరేశ్, ప్రవీణ్, సమ్మయ్య ఉన్నారు.

బొగ్గు టిప్పర్ బోల్తా



బోల్తాపడిన బొగ్గు టిప్పర్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ వెళ్లే మార్గంలో గల చోపిడి సమీపంలో బుధవారం బొగ్గు టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కైరిగూడ నుంచి బొగ్గు లోడుతో గోలేటి సీహెచ్‌పీ వచ్చే క్రమంలో టీటీసీ సంస్థకు చెందిన బొగ్గు టిప్పర్ ఒక్కసారిగా వాహనం ఎయిర్ పైప్ పగిలి అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

సమన్వయంతో అభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- ముగిసిన మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్/కెరమెరి: గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సిర్పూర్ (యూ) మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. పలు శాఖల తీరుపై చర్చించారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ వేసవి ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సరఫరాతో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, ఏఎంసీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శివాజీ, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సిర్పూర్ యూ మండలంలోని నెట్నూర్‌లో జై ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి క్రీడాపోటీలు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగించడమే కాకుండా వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, సర్పంచ్ అర్క హీరాబాయి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బొజ్జిరావు, లక్ష్మణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కెరమెరి: సిర్పూర్(యూ) మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.

'నాయకుల భూములు కూడా కబ్జా చేస్తున్నారు'



మాట్లాడుతున్న డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూర్: మధ్య తరగతి ప్రజలనే కాకుండా నాయకుల భూములను కూడా కబ్జా చేసిన ఘనత కోనేరు కుటుంబానికే దక్కుతుందని సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని బారేగూడ గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాగోస -బీజేపీ భరోసా శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండే విఠల్‌కు కాగజ్‌నగర్ మండలం మోసం గ్రామ శివారులో వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి ఉంటే దాన్ని కూడా కబ్జా చేయడానికి స్థానిక ఎమ్మెల్యే సోదరుడు ప్రయత్నిస్తున్నారని, ఇటీవల ఇదే విషయమై కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో గొడవ సైతం చోటు చేసుకుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు జాడి దిగంబర్, మండల ఇన్‌చార్జి సమీర్ గుప్తా, సింగిల్ విండో డైరెక్టర్ తేలే బాపు, మాజీ వైస్ ఎంపీపీ రామయ్య, ఉప సర్పంచ్ తిరుపతి, మాజీ సర్పంచ్‌లు వసీఉల్లా ఖాన్, రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, తిరుపతి గౌడ్, కిష్టయ్య, మురళి గౌడ్, శ్యామ్ సుందర్, కిషన్ గోపాల్, పర్దేశి, వెంకటేష్, సంజీవ్, శ్రావణ్‌గౌడ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సమస్యలు పరిష్కారం

కౌటాల: బీజేపీతోనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని బీజేపీ మండల అధ్యక్షుడు నారులే వాసు పటేల్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని గుండాయిపేట గ్రామంలో ప్రజాగోస బీజేపీ భరోసా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

భూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో భూ అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, నా యకులపై తగిన చర్యలు తీసుకోవాలని బీ ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, తాలుకా ఇన్‌చార్జి అర్షద్‌హుస్సేన్‌లు కోరారు. బుధవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

చిన్నసిద్దాపూర్‌లోనే జీపీ భవనం నిర్మించాలి



వినతిపత్రం అందిస్తున్న ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

బెజ్జూర్: బెజ్జూర్ మండలం పెద్ద సిద్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న సిద్దాపూర్‌లోనే గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలని ఉప సర్పంచ్ టాకిరె శ్రీనివాస్, పెద్దసిద్దాపూర్ జీపీ వార్డు సభ్యులు నికూరి కోటేశ్, నికూరి సుజాత, సెండె మహేశ్, నికూరి రమేశ్‌లు కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి, ఎంపీడీవో మాధవిలకు వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ పెద్దసిద్దాపూర్‌లో జనాభా తక్కువగా ఉన్నా అక్కడ గ్రామపంచాయతీ భవనం నిర్మించేందుకు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. చిన్నసిద్దాపూర్‌లో జీపీ భవనం నిర్మించాలని, లేదంటే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు భూమిపూజ చేశారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రూ. 12లక్షల అంచనా వ్యయంతో గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, మాజీ ఎంపీటీసీ పిర్సింగుల పోచయ్య, ఉప సర్పంచ్ భాస్కర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.